
సాక్షి
గుంటూరు
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 7026 క్యూసెక్కులు వదిలారు. బ్యాంక్ కెనాల్‌కు 1645 క్యూసెక్కులు వదిలారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి 51,042 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి 51,042 క్యూసెక్కులు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది.

శివాలయంలో స్వచ్ఛతా హి సేవ



పెదకాకాని: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హి సేవ-2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం పెదకాకాని శివాలయంలో మొక్కలు నాటారు.

బాబు ప్రగల్భాలు



ఎన్నికల ప్రచారంలో భాగంగా మే ఒకటిన గుంటూరులో పర్యటించిన టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ 6 పథకాలపై ఊదరగొట్టారు. తమ కూటమి అధికారంలోకి వస్తే సంపద సృష్టించి పేదలను లక్షాధికారులను చేస్తానని ప్రగల్భాలు పలికారు.

మాటల్లోనే కోటలు



మే ఏడో తేదీన టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఈనాడు దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ క్లిప్పింగ్ ఇది.. సూపర్ 6 పథకాలతో అద్భుతాలు జరుగుతాయని ఆయన పదేపదే వల్లెవేశారు. సూపర్ 6తో సమగ్ర అభివృద్ధి అంటూ గొప్పలు పోయారు. ఇప్పుడు మౌనం వహించారు.

కనిపించని సంక్షేమం




మే 3న టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి ఈనాడు దిన పత్రికతో మాట్లాడినట్లు ప్రచురితమైన క్లిప్పింగ్ ఇది.. ఆ సందర్భంగా సంక్షేమానికే తమ పార్టీ తొలి ప్రాధాన్యం అంటూ గల్లా మాధవి చెప్పారు. సూపర్ 6 పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తాయని, నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని ఊదరగొట్టారు.

మాయా మేనిఫెస్టో



ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇద్దరూ ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక(మేనిఫెస్టో) ప్రకటించారు. అందులో సూపర్-6 పథకాలకు తమ ప్రాధాన్యమని నొక్కివక్కాణించారు. పవన్ కళ్యాణ్ మరో అడుగు ముందుకేసి అధికారంలోకి వచ్చాక ఈ హామీలు అమలు చేయించే బాధ్యత తనదని ఘంటాపథంగా చెప్పారు. ఇప్పుడు ఏమీ మాట్లాడకుండా మిన్నకుండిపోయారు.

ఆరుతేరిన మోసగాడు



- తల్లికి వందనం ఎప్పుడిస్తారు? మా వద్దకు డేటా ఇంకా రాలేదు..
- రైతులకు సాయం ఇకనైనా ఇస్తారా? ఇంకా ఏమీ అనుకోలేదు..
- ఆర్టీసీలో ఉచిత ప్రయాణమెప్పుడో? కసరత్తు చే..స్తున్నాం.
- నిరుద్యోగ భృతి సంగతేంటి? అమ్మో..ఆర్థిక సంక్షోభంలో ఉన్నాం..
- మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తారా? రోడ్ మ్యాప్‌లవీ పూర్తిచేశాక ఆలోచిద్దాం..



నిప్పునని చెప్పుకొనే నివురుగప్పిన మోసం.. దగా అనే పదానికి పేటెంట్ తీసుకున్న వ్యక్తి.. మంచిపై విషంగక్కే 'శ్వేత'నాగు.. ఈ విశేషణాలన్నీ చక్కగా సరిపోయే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఆయన ఎన్నికల ముందు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను అధికారం చేపట్టి వంద రోజులైనా అమలు చేయలేకపోయారు. సాక్షాత్తూ అసెంబ్లీ సాక్షిగా పథకాల అమలు సాధ్యం కాదంటూ మొసలికన్నీరు కార్చారు. భరోసాతో కులాసాగా ఉన్న అన్నదాత నోట్లో సుఖీభవ అంటూ మన్నుకొట్టారు. సిరులు కురిసిన 'అమ్మఒడి'కి తల్లికి వందనం పేరిట తీరని వేదన మిగిల్చారు. చేయూత, ఆసరాతో నవ్వులొలికిన అబలల గుండెల్లో ప్రతినెలా రూ.1,500 అంటూ మంటలు రేపారు. ఉచిత ప్రయాణం పేరిట నెత్తిన 'బస్'మాసుర హస్తం పెట్టారు. ఏడాదికి మూడు సిలిండర్లంటూ గ్యాస్ కొట్టారు. ఇంటికో ఉద్యోగం.. నిరుద్యోగ భృతి అంటూ యువగళంలో గరళం పోశారు. ప్రజలను దారుణంగా వంచించిన 'ఆరు'తేరిన మోసగాడిగా చరిత్రలో నిలిచిపోయారు. దీంతో మాయాకూటమిపై గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రజాగ్రహం వ్యక్తమవుతోంది. హామీలు తీర్చాల్సిందేనన్న డిమాండ్ వినిపిస్తోంది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించిన సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు ఇప్పుడు దగా చేస్తున్నారు. తానొస్తే సంపద సృష్టించి సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేస్తానని బాబు ప్రగల్భాలు పలికారు. గుంటూరులో ఏకంగా ఐటీ టవర్లు కట్టి ఉపాధి కల్పిస్తానని గొప్పలు చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులూ సూపర్‌సిక్స్‌పై భారీగా ప్రకటనలు ఇచ్చారు. తీరా ఇప్పుడు అధికారం చేపట్టాక గత ప్రభుత్వంపై శ్వేతపత్రాల పేరిట నిందలు మోపుతున్నారు. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోవడం వల్ల ఆరు పథకాలు అమలు చేయాలంటే భయమేస్తోందంటూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. ఈ ఏడాది వీటి అమలుకు అవకాశం లేదంటూ మంత్రులు సన్నాయి నొక్కులు నొక్కడంపై వ్యతిరేక గళం వినిపిస్తోంది.

జగన్ సీఎంగా ఉండి ఉంటే..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ వచ్చి ఉంటే ఇప్పటికే అమ్మఒడి పథకం ద్వారా డబ్బులు జూన్ 21నే వచ్చేవని మహిళలు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఖరీఫ్‌కు ముందే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టుబడి సాయం అందించేవారు. ఆయన సీఎం అయ్యుంటే ఈ ఏడాదీ ఈ పాటికే రైతుభరోసాగా మొదటి విడత సొమ్ములు రైతులకు అంది ఉండేవి.

బాబు.. ఏదీ జవాబు

తల్లికి వందనం



ప్రభుత్వ, ప్రైవేట్ బడులతోపాటు ఇంటర్ చదువుతున్న విద్యార్థుల సంఖ్య : 3,60,000
అర్హులైన విద్యార్థులు : సుమారు 1,60,000
ఏడాదికి రూ.15,000 చొప్పున అందించాల్సిన సాయం : రూ.240 కోట్లు


తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయాలి



వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ తరహాలో వసతులు కల్పించారు. ఉపాధ్యాయులు బాగానే చదువు చెబుతున్నారు. మాకు ఏడో తరగతి చదివే సన ఇర్మత్, ఐదో తరగతి చదివే ఖాజా మొహిద్దీన్ సంతానం. ఇద్దరూ వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్నారు. ప్రభుత్వం ఇంతవరకు తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేయలేదు. ఎప్పుడు జమ చేస్తారో కూడా తెలియదు. ఎన్నికల్లో చెప్పేదొకటి తీరా గెలిచిన తరువాత చేసేదొకటి. ఇకనైనా ఇచ్చిన మాట నిలుపుకోవాలి. వెంటనే ఖాతాల్లో నగదు జమ చేసి పేద తల్లులకు ఊరట కల్పించాలి.

– షేక్ రేష్మా, తల్లి, అగతవరప్పాడు ఏపీఎస్ కాలనీ

అన్నదాత సుఖీభవ



జిల్లాలో రైతులు : 1,24,645
ఏడాదికి రూ. 20 వేలు చొప్పున అందించాల్సిన సాయం : రూ. 249.29 కోట్లు

రైతులకు సాయం ఎప్పుడు చేస్తారు?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాతలకు సుఖీభవ పథకం ద్వారా ఇస్తానన్న రూ.20 వేలు సాయం అందించాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జూన్ మాసంలో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వ్యవసాయ పనులకు పెట్టుబడి సాయం అందించాలి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సుఖీభవ నిధులు జమ చేయకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

–ఇంటూరి జయపాల్‌రెడ్డి, కొత్తరెడ్డిపాలెం, చేబ్రోలు మండలం

నిరుద్యోగ భృతి

జిల్లాలో కుటుంబాలు : 5.54 లక్షలు
జిల్లాలో 18 – 35 ఏళ్లలోపు ఉన్న యువత : 3,05,000
ప్రస్తుత అంచనాల ప్రకారం ఏడాదికి ఇవ్వాల్సిన భృతి : రూ.1,098 కోట్లు



ఇకనైనా భృతి ఇవ్వాలి



ఎన్నికల సమయంలో కూటమి అధికారంలోకి వస్తే సూపర్ 6 పథకాలను అమలు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. నిరుద్యోగ భృతి తప్పకుండా ఇస్తామన్నారు. 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, అప్పటి వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు వంతున భృతి ఇస్తామని పేర్కొన్నారు. ఆ హామీని అమలు చేయాలి. యువనేస్తం పథకం ద్వారా యువత కలలను నెరవేర్చాలి.

–పసుపులేటి శ్రీనివాసరావు, చేబ్రోలు

వైఎస్ జగన్ ఐదేళ్లలో చేసిన సంక్షేమ కార్యక్రమాలు



వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం ఇంటింటి తలుపు తట్టింది. ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి మరీ హామీలు అమలు చేశారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన.. ఇలా ఒకటీ రెండు కాదు.. ఇచ్చిన ప్రతి హామీ అమలైంది. ప్రతి ఇంటా సంక్షేమం వెల్లివిరిసింది.

జగనన్న అమ్మ ఒడి



2,01,590 లబ్ధిదారుల సంఖ్య
రూ.657.39 కోట్లు నగదు లబ్ధి

వైఎస్సార్ రైతు భరోసా



1,77,545 లబ్ధిదారుల సంఖ్య
రూ.885.97 కోట్లు నగదు లబ్ధి

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ



86,931 లబ్ధిదారుల సంఖ్య
రూ.394.80 కోట్లు నగదు లబ్ధి

జగనన్న వసతి, విద్యా దీవెన

లబ్ధిదారుల సంఖ్య 1,05,471
నగదు లబ్ధి రూ.115.86 కోట్లు

లబ్ధిదారుల సంఖ్య 1,15,392
నగదు లబ్ధి రూ.364.94 కోట్లు

నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు




45,615 లబ్ధిదారుల సంఖ్య
రూ.543.66 కోట్లు నగదు లబ్ధి

జగనన్న పాలనలో జిల్లాలో అన్ని పథకాల ద్వారా కలిగిన లబ్ధి

24,14,735 లబ్ధిదారుల సంఖ్య
రూ.7,955.54 కోట్లు నగదు లబ్ధి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

గుంటూరు రీజియన్‌లో మొత్తం బస్సులు : 369
రోజూ ఆర్టీసీకి వస్తున్న ఆదాయం : రూ. 60 లక్షలు
ప్రస్తుతం ప్రయాణికుల్లో మహిళల శాతం : 50
ఉచిత ప్రయాణం అమలైతే మహిళలకు కలిగే లబ్ధి (అంచనా) : రూ.30 లక్షలు



ఉచిత ప్రయాణం ఏమైంది?



ఉచిత బస్సు ప్రయాణాల ఊసే లేదు. కూటమి నాయకులు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలను కల్పిస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి మూడు నెల దాటినా ఇప్పటివరకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంపై మాట్లాడటం లేదు. మహిళలందరూ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

– కనపర్తి ప్రశాంతి, తూములూరు, కొల్లిపర మండలం

మహిళలకు ప్రతి నెలా రూ.1,500



జిల్లాలో 18 ఏళ్లు నిండిన మహిళలు : 9,13,852
సామాజిక పింఛన్లు పొందుతున్న వారు : 1,85,461
రూ.1,500 పొందేందుకు అర్హులు : 7,28,391
ఏడాదికి అందించాల్సిన సాయం : రూ.1311.10 కోట్లు

నెలకు రూ.1,500 ఇవ్వాల్సిందే...



ప్రతి మహిళకూ రూ.1,500 నెలకు ఇస్తామని గత ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు హోరెత్తించారు. ఎన్నిల సమయంలో అన్ని సభల్లోనూ కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు. తీరా అందలం ఎక్కిన తరువాత ఆ ఊసే లేకుండా పోయింది. హామీలు ఇచ్చి మరచిపోయారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా మహిళలందరూ ఈ మొత్తం ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నారు.

– కొండమడుగుల నాగమణి, గృహిణి, వెనిగండ్ల

ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు



జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు : 7,55,000
ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు చొప్పున మొత్తం ఇవ్వాల్సినవి : 22,65,000
ప్రస్తుతం సిలిండర్ ధర : రూ. 827.51
ఏడాదికి మూడు సిలిండర్ల అర్హులకు కలగాల్సిన లబ్ధి : రూ.187.43 కోట్లు

ఉచిత సిలిండర్లు రాలేదు..

ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఇంతవరకూ వాటి జాడ లేదు. వంద రోజుల పాలనలో అమలు కాలేదు. ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. ఇప్పటికే కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన కూడా పూర్తి చేశారు. హామీలు అమలు చేయాలి.

– వంగా నవీన్‌రెడ్డి, జొన్నలగడ్డ, గుంటూరు రూరల్ మండలం

ముంపుతో 1.04 లక్షల మంది ప్రభావితం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం: జిల్లాలోని 11 మండలాలకు చెందిన 25 గ్రామాలు, నాలుగు పట్టణాల్లోని 41 వార్డులు వరద ముంపునకు నష్టపోయాయని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పేర్కొన్నారు. మొత్తం 1.04 లక్షల మంది ప్రభావితమైనట్లు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్మెంట్) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియాకు తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని ఏపీఎస్డీఎంఏ కార్యాలయం నుంచి ఆర్‌పీ సిసోడియా వరద ముంపు ప్రాంతాలలో నష్టాల ఎన్యూమరేషన్ వివరాలపై జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) స్వప్నిల్ పవార్ జగన్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వరద ముంపు వల్ల 1,04,276 మంది ప్రభావితం అయ్యారన్నారు. ఏడుగురు చనిపోయారని, వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందించామని పేర్కొన్నారు. ముంపు వల్ల ఆవులు, గేదెలు -180, గొర్రెలు, మేకలు -12, ఎద్దులు - 2, కోళ్లు - 527 చనిపోయాయన్నారు. వరద నీరు 9,780 ఇళ్లలో చేరిందని చెప్పారు. 34 పక్కా, కచ్చా ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వెల్లడించారు. పాక్షికంగా 83 పక్కా, 459 కచ్చా గృహాలకు నష్టం వాటిల్లినట్లు వివరించారు. పూరిళ్లు 340, పశువుల పాకలు 209 ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. ముంపునకు గురైన కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి యాప్‌లో అప్డేట్ చేశామని తెలిపారు. బాధితుల బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలు సేకరించామని వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, డిజాస్టర్ మేనేజ్మెంట్ (ఎస్‌డీజీ) మేనేజర్ లక్ష్మీకుమారి, ఏవో ఇస్మాయిల్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

23 వరకు పంటల నమోదుకు అవకాశం

కొరిటెపాడు(గుంటూరు): ఖరీఫ్ పంటల నమోదుకు వ్యవసాయ శాఖ షెడ్యూల్‌లో మార్పులు చేసింది. గతంలో ప్రకటించిన మేరకైతే ఈ నెల 15వ తేదీ నాటికే ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలి. కానీ 23వ తేదీ వరకు అవకాశం కల్పించింది. 27వ తేదీ వరకు గ్రామ స్థాయిలోని రైతు సేవా కేంద్రాలవారీగా సభలు నిర్వహించి పంటల నమోదు జాబితాలను సోషల్ ఆడిట్‌కు పెట్టనున్నారు. వచ్చిన అభ్యంతరాలను 28, 29వ తేదీలలో పరిష్కరిస్తారు. తుది జాబితాను 30వ తేదీన ప్రకటిస్తారు. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3,14,785 ఎకరాలు కాగా.. 2,10,201 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 2,06,685 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేశారు. నెల్లూరు, అనకాపల్లి, తిరుపతి మండలాల్లో ప్రక్రియ కొంత వరకు పెండింగ్‌లో ఉంది. ఏఓలు అలసత్వం వహించినట్లు తెలుస్తోంది. నమోదు చేసిన వాటిలో 2,01,942.97 ఎకరాలలో (97.91 శాతం) సాగు చేసిన పంటలకు వీఏఏ ఈ-కేవైసీ పూర్తి చేశారు.

రేపు జాబ్ మేళాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈ నెల 20న చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో జాబ్ మేళాలను నిర్వహించనున్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఇవి ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పిన్నింటి ప్రణయ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, బీటెక్, డిప్లొమా, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు రెజ్యూమ్, సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావొచ్చని సూచించారు. వివరాలకు చేబ్రోలుకు వెళ్లేవారు రాంచంద్‌ను 96665 45975, నల్లపాడు వెళ్లేవారు రవికుమార్‌ను 93473 72996లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వడ్డమానులో వైఎస్సార్ సీపీ నేతపై టీడీపీ రౌడీషీటర్ల దాడి

- కాళ్లు, చేతులు విరగడంతో గుంటూరులోని ఆసుపత్రిలో చేరిక
- శస్త్రచికిత్స చేసి మూడు రాడ్లు వేయాల్సి వస్తుందని వైద్యుల నిర్ధారణ
- బాధితుడికి ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ, మందపాటి పరామర్శ


గాయపడిన సంజీవరెడ్డిని పరామర్శిస్తున్న అప్పిరెడ్డి, మందపాటి, మేరుగ నాగార్జున


పరామర్శిస్తున్న మాజీ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్

వడ్డమాను(తాడికొండ): గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామంలో కో ఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ చుండు వెంకటరెడ్డి బావ వడ్డే సంజీవరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ రౌడీషీటర్లు కడియాల పుణ్యవర్ధనరావు, కుమారుడు సాయితేజ, యోగేంద్ర తదితరులు దాడికి పాల్పడ్డారు. బుధవారం వేకువజామునే సంజీవరెడ్డి వడ్డమాను గ్రామ శివారు మద్దూరు రోడ్డు వరకు వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా జొన్న చేనులో కాపు కాసిన రౌడీషీటర్‌లు కడియాల పుణ్యవర్ధనరావు, కుమారుడు సాయితేజ, యోగేంద్ర, మరో ఇద్దరు ఆకస్మికంగా దాడి చేశారు. రాడ్లతో విచక్షణారహితంగా కొట్టారు. ఐదుగురు ఒకేసారి మీదపడటంతో సంజీవ రెడ్డికి కాలు రెండు చోట్ల, చేయి ఒక చోట విరిగిపోయాయి. పలుచోట్ల కమిలిన దెబ్బలు తగిలాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆయన్ని గుంటూరులోని సాయిభాస్కర్ ఆసుపత్రికి తరలించారు. విరిగిన చోట్ల రాడ్లు వేయాలని వైద్యులు సూచించారని కుటుంబసభ్యులు తెలిపారు. రౌడీషీటర్లు అయిన తండ్రీ కొడుకులు గతంలో ప్రభుత్వ ఉద్యోగిని అడ్డగించడంతో పాటు పలు గొడవల కేసుల్లో నిందితులుగా ఉన్నారు. దీంతో రౌడీషీట్ ఓపెన్ చేశారు. అయినప్పటికీ వారి తీరు మార్చుకోకుండా ఇలానే గొడవలకు దిగుతుండటం పరిపాటిగా మారింది. వడ్డమానులో చెరువుకు చెందిన అర ఎకరం భూమిని ఆక్రమించడంతో గతంలో పంచాయతీ అధికారులు వెనక్కి తీసుకున్నారు. దీనికి కారణం సంజీవరెడ్డి, వారి కుటుంబ సభ్యులేనని మనసులో పెట్టుకున్న తండ్రీకొడుకులు ఇలా మరికొందరితో కలిసి విచక్షణారహితంగా కొట్టారు. వీరిద్దరిని బుధవారం ఉదయం తుళ్ళూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటన అమరావతి మండలం పరిధి సరిహద్దులో జరిగినట్లు నిర్ధారణ కావడంతో అక్కడి పోలీసులకు అప్పగించారు. గుంటూరులోని సాయిభాస్కర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని బుధవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, జిల్లా పార్టీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్‌లు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిద్రిస్తున్న వ్యక్తిని కర్రతో మోది హత్య

- తన భార్యతో మాట్లాడొద్దన్నందుకు ఘాతుకం
- కొల్లూరు మండలం పోతార్లంకలో ఘటన


హతుడు శ్రీరామకృష్ణ (ఫైల్)


సిమెంట్ బల్లపై శ్రీరామకృష్ణ మృతదేహం.. వివరాలు నమోదు చేసుకుంటున్న ఏఎస్ఐ రామయ్య

కొల్లూరు: నిద్రిస్తున్న వ్యక్తిని గుదిబండ లాంటి కర్రతో మోది హత్య చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పోతార్లంకకు చెందిన దంతాల శ్రీరామకృష్ణ (32) అలియాస్ శ్రీరామయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వివాహమై చిన్నారులైన ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతని భార్య గత ఆరు నెలలుగా అనారోగ్య కారణంతో పుట్టింటిలో ఉంటోంది. గతంలో తన భార్యతో స్థానికంగా నివాసం ఉంటున్న విష్ణు మొలకల పవన్‌సాయి అలియాస్ కువైట్ పలుమార్లు మాట్లాడటాన్ని శ్రీరామకృష్ణ గమనించాడు. పవన్‌సాయిని పద్ధతి మార్చుకోవాలని, తన భార్యతో మాట్లాడటం మానుకోవాలని మందలించాడు. అయినప్పటికీ శ్రీరామకృష్ణ భార్యతో మాట్లాడటానికి పవన్‌సాయి యత్నిస్తుండటంతో సక్రమంగా ఉండాలని హెచ్చరించాడు. దీంతో పగ పెంచుకున్న పవన్‌సాయి మంగళవారం అర్ధరాత్రి స్థానిక సచివాలయం వద్ద నున్న రామకృష్ణ హోటల్ ఎదురుగా ఉన్న పంచాయతీ సిమెంట్ బల్లపై పడుకొని నిద్రిస్తున్న శ్రీరామకృష్ణను గమనించి, తనకు అందుబాటులో దొరికిన గుదిబండ లాంటి లావుపాటి కర్ర తీసుకొచ్చి తలపై బలంగా మోదాడు. దీంతో శ్రీరామకృష్ణ నిద్రలోనే మృతి చెందాడు. అనంతరం నిందితుడైన పవన్‌సాయి మృతుడి తమ్ముడు విజయ్‌కుమార్‌కు ఫోన్ చేసి తాను ఒక వ్యక్తిని హత్య చేశానని చెప్పి అక్కడ నుంచి ఉడాయించాడు. తన సోదరుడు అర్ధరాత్రి 12 దాటినా ఇంటికి చేరుకోకపోవడం, ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో అనుమానంతో పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి చూసేసరికి శ్రీరామకృష్ణ రక్తపు మడుగులో పడి ఉండటం గమనించాడు. స్థానికుల సహకారంతో కొల్లూరు పోలీసులకు సమాచారం అందించడంతో వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు నేతృత్వంలో కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. హత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. మృతుడి సోదరుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

● హత్యకు పవన్‌సాయి కారణమని నిర్ధారించుకున్న పోలీసులు అతనితో రాత్రి ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించారు. ఆ వ్యక్తులను పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న క్రమంలో నిందితుడైన పవన్‌సాయి దోనేపూడి శివారు ఆలపాటినగరం వద్ద నడుచుకుంటూ వెళుతుండటం గమనించారు. తమతో ఉన్న పోలీసులకు ఆ వ్యక్తులు ఈ విషయం చెప్పడంతో అతడిని కూడా అదుపులోకి తీసుకొన్నట్లు మృతుడి బంధువులు, పోతార్లంక వాసులు పేర్కొంటున్నారు. నిందితుడి అరెస్టును పోలీసులు ఇంకా నిర్ధారించలేదు.

నలుగురికి డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం: రాష్ట్రంలోని పలు రేంజ్‌ల పరిధిలో 14 మంది సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి, పోస్టింగ్‌లు కల్పిస్తూ డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు రేంజ్‌లోని సీఐలు ఎం.రత్తయ్య, ఎండీ.మొయిన్, కె.సుధాకర్‌బాబు, పి.అక్కేశ్వరరావులకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఎం.రత్తయ్య, కె.సుధాకర్‌బాబులకు ఇంటిలిజెన్స్ విభాగం డీఎస్పీలుగా, పి.అక్కేశ్వరరావును గుంటూరు డీఎస్ఆర్‌పీ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. డీఎస్పీ ఎండీ.మొయిన్‌ను పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

'స్కిల్ సెన్సస్' ఎన్యూమరేటర్లకు శిక్షణ ప్రారంభం

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 18న దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో స్కిల్ సెన్సస్ సర్వే నిర్వహించేందుకు యాప్ వినియోగించనున్నారు. సంబంధిత ఎన్యూమరేటర్లకు బుధవారం శిక్షణ ప్రారంభించామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పిన్నెంటి ప్రణయ్ తెలిపారు. ఈ శిక్షణ తర్వాత మొదటి విడతలో మంగళగిరిలో ప్రక్రియ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ శిక్షణలో వివిధ శాఖలకు చెందిన 400 మంది ఎన్యూమరేటర్లు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో జి.గణేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్, సీడప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరూ భోజనం చేసేలా చూడాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

లక్ష్మీపురం: పాఠశాలలో విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ సమావేశ మందిరంలో డీఈఓ శైలజ, ఆ శాఖ అధికారులతో కలిసి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు, సభ్యులు, వంట ఏజెన్సీల వారితో జిల్లా కలెక్టర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం చేసే వారి సంఖ్య తగ్గుతోందన్నారు. దీని నివారణకు మెనూలో మార్పులపై ప్రజాభిప్రాయం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉన్న బడ్జెట్‌లోనే మెరుగైన ఆహారం ఇవ్వడానికి సూచనలు చేయాలన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల వారు మాట్లాడుతూ సన్న బియ్యం ఇవ్వాలని కోరారు. చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ అడుగుతున్నారని, రాగి జావ తాగటం లేదని తెలిపారు. రాగి చిక్కీలు, లడ్డూలు ఇస్తే బాగుంటుందన్నారు. పొంగలి కూడా తినటం లేదని, రెండు రోజులకు ఒకసారి పాలు అందించాలని సూచించారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ వారు సాంబారు అన్నం కలిపి ఇస్తున్నారని గుర్తు చేశారు. వైట్ రైస్, సాంబారు విడివిడిగా ఇవ్వాలని సూచించారు. ఉడికించిన కోడిగుడ్ల పెంకు తీసి ఏజెన్సీ వారు ఇస్తున్నారని, పెంకుతో ఇస్తే పిల్లలే తీసుకుంటారని తెలిపారు. శనివారం అక్షయపాత్ర ఫౌండేషన్ ఇచ్చే స్వీట్‌ను ప్రసాదంగా భావించి విద్యార్థులు తినటం లేదన్నారు. వంట ఏజెన్సీ వారు సకాలంలో బిల్లులు రాక అప్పులు చేస్తున్నామని తెలిపారు. నెలకోసారి బిల్లులు చెల్లించాలని కోరారు. కుకింగ్ ఛార్జీలు పెంచేలా ప్రభుత్వానికి నివేదించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

ప్లాస్టిక్ నిషేధానికి పటిష్ట చర్యలు

- గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ
- రైల్వే స్టేషన్‌లో రెండో రోజూ 'స్వచ్ఛతా హి సేవ'


ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్లాస్టిక్ నిషేధానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో రెండో రోజు బుధవారం కూడా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం కొనసాగింది. ఇందులో ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని చెప్పారు. ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. గుంటూరు, నడికుడి, నంద్యాల హెల్త్ యూనిట్లలో ఔట్‌సోర్సింగ్ క్లీనింగ్ సిబ్బందికి ఆరోగ్య పరీక్ష శిబిరాలు నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో నుక్కడ్ నాటక ప్రదర్శన సహా సాంస్కృతిక వేడుకలు, ప్రయాణికులకు కాటన్ బ్యాగుల పంపిణీ, సెల్ఫీ బూత్, బాటిల్ క్రషింగ్ మెషీన్ కార్యాచరణ తనిఖీ, ఔట్ సోర్సింగ్ క్లీనింగ్ సిబ్బందికి పీపీఈ కిట్‌ల పంపిణీ, సఫాయి మిత్రలకు కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణలోనూ డీఆర్ఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎం.రవికిరణ్, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ షేక్ షాహబాజ్ హనూర్, ఏడీఎంఈ రవీంద్ర, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వంతెన!

ప్రమాదకరంగా పెనుమాక – కృష్ణాయపాలెం బ్రిడ్జి


విరిగిపోయిన సైడ్ వాల్

తాడేపల్లి రూరల్: రాజధాని గ్రామాలను కలిపే పెనుమాక- కృష్ణాయపాలెం బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. కొండవీటి వాగుపై ఉన్న ఈ బ్రిడ్జికి సైడ్, రిటైనింగ్ వాల్స్ గతంలో వరదల వల్ల దెబ్బతిన్నాయి. ఇటీవల అధిక వర్షాల కారణంగా బ్రిడ్జిపై గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. ఒక వాహనం వస్తే రెండో వైపు వాహనాన్ని నిలిపి వేయాల్సిన పరిస్థితి నెలకొంది. రాజధానికి రాకపోకలు సాగించే వారు ఈ వంతెన దాటాల్సి ఉంటుంది. పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఇప్పుడు మరమ్మతులు నిర్వహించాలని, భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా డబుల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్లు ఇవే

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్-17 బాలబాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను బుధవారం సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి బాలుర విభాగంలో 170 మంది, బాలికల విభాగంలో 90 మంది ఎంపిక పోటీలలో పాల్గొన్నారు. ఈ ప్రక్రియను స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ పర్యవేక్షించారు.

బాలికల జట్టు..

ఎ.జాహ్నవిరెడ్డి, జె.శ్రీవల్లి, ఎస్.గీతిక, ఐ.వాసంతి, కె.భవ్యశ్రీ (కొర్రపాడు), వి.దేవిక, పి.శ్రీలక్ష్మీ, జి.శ్రీవల్లి(పెదమక్కెన), వి.ప్రవల్లిక, పి.షారోన్ వల్లిక, టి.హానీ, టి.శ్రీలక్ష్మి, జి.నందిని, షేక్.బాజీద్ బీ, పి.రమ్యశ్రీ, ఎం.భవిష్య, టి.స్వరూపారాణి (ఉప్పలపాడు), టి.ఎస్.ఎస్.మహేశ్వరి (సత్తెనపల్లి), ఎస్.శ్రావ్య (మాదల), పి.శ్రీలేఖ, బి.మోక్షసాధన (నందిగామ), బి.చంద్రిక (సుగాలి, సత్తెనపల్లి) ఎంపికయ్యారు.

బాలుర విభాగం..

పి.తేజ, పి.నవీన్ కుమార్ (నందిగామ), షేక్ సోహిల్ తన్వీర్, వెంకటగిరి (ఫిరంగిపురం), సయ్యద్ అలీ, ఇస్సాకు, ఆసిఫ్, జ్యోతి స్వరూప్ (మున్సిపల్ హైస్కూల్, నరసరావుపేట), షేక్ నాగనజీర్ (వాగ్దేవి కళాశాల, నరసరావుపేట), డి.సాయికుమార్ (కె.ఆర్.కళాశాల), శివమణి (సుగాలి, సత్తెనపల్లి), బి.రాఘవ, జి.సుభాష్ (అమరావతి), చరణ్ కుమార్ (కొర్రపాడు), బి.మహిధర్ (చినకాకాని), బి.జస్వంత్ నాయక్ (లయోలా, వినుకొండ), వై.పోతురాజు (పెదమక్కెన), డి.అంకమ రావు, పి.నాగరాజు (మాదల) ఎంపికయ్యారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 4,000 గరిష్ఠం : రూ. 7,000

మోడల్ ధర రూ. 5,500

జిల్లా ఎస్‌బీ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సీతారామయ్య




నగరంపాలెం: జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీఎస్పీగా బి.సీతారామయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఎమ్మిగనూరులో విధులు నిర్వహిస్తోన్న బి.సీతారామయ్యను ఇక్కడికి బదిలీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో కలెక్టరేట్ రోడ్‌లోని ఎస్‌బీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో గుంటూరు తూర్పు డీఎస్పీగా పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం గుంటూరు రేంజ్ డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ట్రాఫిక్ డీఎస్పీగా ఎం.రమేష్ బాధ్యతల స్వీకరణ



పట్నంబజారు: గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీగా ఎం.రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఎస్సైగా పలు ప్రాంతాల్లో ఆయన పనిచేశారు. 2004లో సీఐగా పదోన్నతి వచ్చింది. 2014లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. మైలవరం, మచిలీపట్నం, విజయవాడలోని పలు విభాగాల్లో విధులు నిర్వర్తించారు. ఎన్నిక సమయంలో ఆయన్ను తెనాలి డీఎస్పీగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.


తెనాలి గంగానమ్మపేటలోని ప్రసిద్ధి చెందిన శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీపర్వతవర్ధిని అమ్మవారిని భాద్రపద మాసం పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం గాజులదండలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. – తెనాలి